క్లుప్తంగా

జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు నందిని ఎంపిక

చిన్నచింతకుంట: మండలంలోని అల్లిపూరం గ్రామానికి చెందిన క్రీడాకారిణి నందిని ఈ నెల 5న మహబూబ్‌నగర్‌లోని డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. సోమవారం వనపర్తి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో 200, 100మీటర్ల రిలే పరుగు పందెంలో నందిని పాల్గొంది. ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం దక్కించుకుంది.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, పండుగ సాయన్న సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ నియామకపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగానే కాకుండా ఉమ్మడి జిల్లాలో మన ముదిరాజ్ మహాసభను బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ముదిరాజ్‌లకు రాజ్యాధికారంలో వాటాకోసం పోరాటం చేస్తామని అన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ

నవాబుపేట: మండలంలోని గుబ్బడిగుచ్చతండాలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సల్వాచారి, గుబ్బడిగుచ్చతండా పాఠశాల హెచ్‌ఎం భూపతిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరలో వైద్యశిబిరం ఏర్పాటు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి జాతరలో చిన్నచింతకుంట పీహెచ్‌సీ వైద్యుడు రాహుల్ వైద్యశిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వారికి ప్రథమచికిత్స అందిస్తామన్నారు.నాలుగు శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లాఅధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిరబోయి, డీఈఓ రవీందర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు బుచ్చారెడ్డి పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ క్రైం: మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ విశ్వహిందూ పరిషత్, ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఎస్పీ జానకిని కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవలే అమ్మాయిలపై దాడులు గణనీయంగా పెరిగాయని ఆయా సంస్థల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు యాదిరెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను నూతన మండలంగా ప్రకటించాలని జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గార్లపహాడ్‌లో జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. మండలంగా ప్రకటించకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. శ్రీహరిగౌడ్, రామకృష్ణారెడ్డి, వెంకటేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

పాలమూరు: జిల్లాకేంద్రంలోని 47వ మున్సిపల్ వార్డులో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ఆయుష్మాన్ భారత్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.5లక్షల వరకు ఉచిత చికిత్స ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, వార్డు నాయకులు వీరన్న, నర్సింహ, వెంకట్‌రాములు, శివ, మహేష్ లాలప్ప పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించండి

- తప్పొప్పులు లేకుండా చూడాలి
- ఎన్యుమరేటర్ల శిక్షణలో జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి



మూసాపేటలో సర్వే ప్రక్రియను వివరిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల టౌన్: సామాజిక, రాజకీయ, ఆర్థిక, కుల సమగ్ర సర్వే కోసం మీపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు. డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో మున్సిపాలిటీ ఎన్యుమరేటర్లకు ఇచ్చిన శిక్షణ, ఎంపీడీఓ సమావేశ మందిరంలో రూరల్ ఎన్యుమరేటర్ల శిక్షణను ఆమె వేర్వేరుగా పరిశీలించి మాట్లాడారు. సర్వేలో మొదట ఉపాధ్యాయులను తీసుకోలేదని, అయితే సర్వే పకడ్బందీగా జరగాలంటే మీరే సమర్థులు అని భావించిన ప్రభుత్వం మిమ్మల్ని తీసుకుందన్నారు. సర్వేపట్ల ఏమైనా సందేహాలున్నట్లయితే ఇక్కడే నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వేకు ఎంపిక చేయబడిన ఎన్యుమరేటర్లకు మినహాయింపులు లేవని, తప్పనిసరిగా చేయాల్సిందేనన్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం నుంచి సర్వే కొనసాగించాలని వారికి సూచించారు. డిగ్రీకళాశాల సమావేశ మందిరంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ సూచనలు

ఎంపీడీఓ సమావేశ మందిరంలో జరిగిన ఎన్యుమరేటర్ల శిక్షణలో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు కేటాయించిన ఇళ్లన్నీ ముందుగా స్టిక్కరింగ్ వేసుకుని ఆ తరువాత సర్వే కొనసాగించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ మంజులాదేవితోపాటు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

సర్వేలో లోపాలు లేకుండా చేపట్టాలి..

భూత్పూర్: సర్వేలో లోపాలు లేకుండా చేపట్టాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. సోమవారం భూత్పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమనేటర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఎన్యుమనేటర్ 90నుంచి 150 ఇళ్లు సర్వేచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ ప్రభాకర్, ఇంచార్జీ మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎన్యుమనేటర్లు పాల్గొన్నారు.

సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలి..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమగ్ర సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని ఎంపీడీఓ కరుణశ్రీ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ హాల్‌లో ఎన్యుమరేటర్లకు మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్ర సర్వేపై అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పులు లేకుండా సర్వే ఫారంను నింపాలని, పూర్తి వివరాలతో సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేకు పోయినప్పుడు ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. సర్వే నిర్వహణకు 150ఇళ్లను ఒక బ్లాక్‌గా ఏర్పాటుచేసి ఒక ఎన్యుమరేటర్‌ను నియ మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అడ్డాకుల: సమగ్ర కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, అధికారులు తదితరులు ఉన్నారు.

నవాబుపేట: సర్వేలో ఎన్యుమరేటర్లు అన్నివివరాలు పూర్తిగా నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సామాజిక సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఆర్‌ఐ కిరణ్‌తోపాటు వివిధశాఖ అధికారులు ఉన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి...

కోయిల్‌కొండ: ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించాలని తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ కాశప్ప సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్యుమనేటర్లకు సమగ్ర సర్వేపై శిక్షణ ఇచ్చారు.

ఉపాధ్యాయులపై నమ్మకంతో..

గండేడ్: ప్రభుత్వం ఉపాధ్యాయులపై నమ్మకంతో సమగ్ర సర్వే బాధ్యతలు అప్పగించిందని డీఆర్‌డీఓ ముసాయిదాబేగం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంబంధించి ఎలాంటి తప్పొప్పులకు తావు లేకుండా వివరాలు చేయాలన్నారు. సర్వేను ఎప్పటికపుడు అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, డీటీ మాధవి, ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టాదార్ పాస్‌పుస్తకం వచ్చిందోచ్.!

- దీర్ఘకాలం పెండింగ్ సమస్య పరిష్కారం
- ఆనందంలో రైతు తాళ్ల రాము



పట్టాదార్ పుస్తకాన్ని చూపిస్తున్న రైతు రాములు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నో ఏళ్లుగా పట్టాదారు పాసుపుస్తకం కోసం చేసిన కృషి ఫలించింది. ఎట్టకేలకు ఆ రైతుకు పాసుబుక్కు రావడంతో అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హన్వాడ మండలం పేరారం గ్రామానికి చెందిన రైతు తాళ్ళ రాములు సుమారు 20ఏళ్ల క్రితం కొండన్న అనే వ్యక్తి దగ్గర వ్యవసాయ భూమి కొని సేద్యం చేసుకుంటున్నాడు. అదే మండలం గుండ్యాల గ్రామంలో సర్వే నంబర్ 387/ఇ/3/2 లో 10 గుంటలు, సర్వే నంబర్ 387/ఇ/2/2 లో 10 గుంటలు 20 గంటల భూమి కొని సేద్యం చేసుకున్నప్పటికీ రాములు పేరుపై భూయాజమాన్య హక్కులు కల్పించ లేదు. గత 20ఏళ్లుగా తహసీల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ అతని పేరున రిజిస్ట్రేషన్ చేయ లేదు. ఇటీవలే తన సమస్యను ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 15 రోజుల్లోనే జిల్లా కలెక్టర్ విజయేందిర ఆదేశాల మేరకు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు రెవెన్యూ అధికారుల ద్వారా పెండింగ్ సమస్యను పరిష్కరించి రైతు రాములుకు పట్టాదార్ పుస్తకం జారీ చేశారు. తన సమస్య పరిష్కారం కావడంతో కలెక్టర్‌కు, అదనపు కలెక్టర్‌కు రాములు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తంచేశారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి



కొనుగోలు కేంద్రంలో తేమ శాతం చూస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మన్యంకొండ స్టేజీ వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ, దళారీ వ్యవస్థను ప్రోత్సహించే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ విక్రమ్, నాయకులు శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, మైబు, శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, రవీందర్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మిడ్జిల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి



రాణిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు కార్యదర్శి నవీన్, సిబ్బంది

జడ్చర్ల: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ పడాల మల్లేష్ ప్రారంభించారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి సదాద్ అలీ, వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, సత్యయ్య, డైరెక్టర్లు తిరుపతయ్య, నర్సిములు, శంకర్‌బాబు, వెంకటయ్య, మాజీ చైర్మన్ దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని వల్లభ్‌రావుపల్లి, కంచన్‌పల్లి, బైరంపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను విక్రయించాలని జ్యోతి రైతులకు సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బంగారు, సత్యం, ఏపీఎం రాందాస్, సీసీ ప్రకాష్, నాయకులు సాయిలు, గౌస్, నర్సింహ్మా, జహంగీర్, శివ, నర్సింహ్మా, యాదగిరి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం..

జడ్చర్ల: మిడ్జిల్ మండలం రాణిపేట శివారులో గల పద్మనాభ కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార్కెట్‌యార్డు కార్యదర్శి నవీన్ ప్రారంభించారు. రైతులు పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీసీఐ అధికారి అశిష్, యార్కెట్‌యార్డు సిబ్బంది రఘు, శ్రీకాంత్, మిల్లు యజమాని శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ వార్షిక పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్, అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన 216మంది అభ్యర్థులకు హైదరాబాద్ సెట్విన్ ఆధ్వర్యంలో సోమవారం వార్షిక పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ జూలై 3 నుంచి అక్టోబర్ 2వరకు 265 మంది యువతకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ అందజేసినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సెట్విన్ సర్టిఫికెట్లు జారీ చేస్తుందన్నారు. ఈపరీక్షలను హైదరాబాద్ సెట్విన్ ట్రైనింగ్ సెంటర్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ఇన్‌చార్జీ సరిత, ఫాతిమా సుల్తానా, ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ ఎస్.విజయ్‌కుమార్, ఫ్యాకల్టీ విజయలక్ష్మి, కౌసల్య, ఖలీల్, ఇమ్రాన్, అజహర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీఈలో ప్రాంగణ ఎంపికలు



విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆయా కంపెనీల ప్రతినిధులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ధర్మాపూర్‌లోని జయప్రకాశ్ నారాయణ్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ (జేపీఎన్‌సీఈ)లో సోమవారం ఎంబీఏ విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు వంద మంది విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్‌తో పాటు ఇంటర్వ్యూ నిర్వహించారు. హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగంలో జెన్ ప్యాక్ట్, టెక్ మహీంద్రా, ముత్తూట్ ఫైనాన్స్, త్రీజీ హెచ్‌ఆర్ సర్వీసెస్, స్పందన స్ఫూర్తి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు ఫయాజ్, రమేశ్, ప్రవీణ్, కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డా.మధుమోహన్, అధ్యాపకులు అనురాధ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన వేడుకలు



శ్రీవారాహి శ్రీశనీశ్వర చంద్రమౌళీశ్వర దేవాలయంలో కార్తీక దీపాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో దీపారాధన వేడుకలు నిర్వహించారు. బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సహస్రదీపాలాంకరణసేవతోపాటు ఆకాశ దీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండ వెంకటేశ్వర్లు, దేవాలయం ప్రధాన అర్చకులు రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు. అలాగే అయోధ్యనగర్‌లోని శ్రీవారాహి శ్రీశనీశ్వర చంద్రమౌళీశ్వర దేవాలయం, కొత్తగంజి సింహరి దేవాలయంతోపాటు పలు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.25లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.25లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లాకార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. జడ్చర్లలో ఈనెల 8, 9న నిర్వహించనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ఉదండాపూర్, వల్లూరు గ్రామాల్లో జీపుజాత నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు వల్లూరు, ఉదండాపూర్ తదితర గిరిజన తండాల ప్రజలు తమ భూములు, ఇండ్లను త్యాగం చేశారన్నారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈమహాసభలకు నిరుద్యోగులు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దీప్లానాయక్, జగన్, మండల నాయకులు సత్తయ్య, యాదయ్య, నాగరాజు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి..

గండేడ్: ఈనెల 8, 9తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకుడు మహేందర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాములు, కొండాపురం బుచ్చయ్య, గాజుల వెంకటయ్య పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: జడ్చర్లలో నిర్వహించే సీపీఎం మహాసభలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ కోరారు. సోమవారం మండలంలోని కురుమూర్తి స్వామి జాతర మైదానంలో సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతు, దయాల కురుమూర్తి, జనార్దన్, మైబు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఈనెల 8న జడ్చర్లలో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు దిప్లానాయక్, జగన్ తెలిపారు. సోమవారం మండలంలో జిల్లా మహాసభలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, శ్యాంసుందర్, శంకర్, యాదయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

జడ్చర్ల టౌన్: తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంఆర్‌డీఎస్ ఎన్‌జీఓ సంస్థ సోమవారం పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌వీఎస్ ఆస్పత్రి, న్యూబస్టాండ్, సిగ్నల్‌గడ్డ, నేతాజిచౌరస్తా, గంగాపురం, రాణిపేట, మిడ్జిల్ గ్రామాల్లోనూ ఆ సంస్థసభ్యులు అశోక్‌గౌడ్, గోవింద్ ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించారు. ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎల్‌ఈడీ స్క్రీన్‌పై షార్ట్‌ఫిల్మ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడికి సన్మానం

హన్వాడ: మండల పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన యారోనిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు స్వామిని సోమవారం ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ ఘనంగా సన్మానించారు. మండలంలో ఉపాధ్యాయ సమస్యల సాధనకు కృషిచేస్తానని స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాకేష్, కృష్ణ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుచేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కావలి కృష్ణయ్య, టైగర్ జంగయ్య, కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ వర్తింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ సదస్సు ఉంటుందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. టి.రాజు, బాలరాజు, రాములు, కమలాకర్, శ్రీరాములు, రామచందర్, కొండన్న, నరసింహా, వెంకటేష్ పాల్గొన్నారు.

బీసీలను ఏకం చేస్తాం

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ కులాలను ఏకం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తా మని బీసీ మేధావుల సంఘం గౌరవ సలహాదారు బెక్కం జనార్దన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8న నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను వాయిదా వేశామని అన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాయకులు జయరాజ్, రమేష్, గంగాధర్, శ్రీనివాస్ సాగర్, మల్లికార్జున్, యాదయ్య, మహేందర్ పాల్గొన్నారు.

మాష్టి హక్కుల సాధనకు ఏకం అవుదాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాష్టి(మాదిగ ఉపకులం) హక్కుల సాధనకోసం ఏకం అవుదామని మాష్టి కులహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పకీలయ్య అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో మహబూబ్‌నగర్, నారాయణపేట్ జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లాల కమిటీలను ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మాష్టి కుల హక్కుల పోరాటసమితి అధ్యక్షుడిగా పకీరయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్, లక్ష్మయ్య, చిరంజీవి, రాజు, రాములు, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రఘు, కార్యదర్శిగా గణేష్, సహాయకార్యదర్శులుగా రాములు, అంజప్ప, వెంకటప్ప, సాందస్, కోశాధికారిగా శివకుమార్‌ను ఎన్నుకున్నారు.

హోరాహోరీగా ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ

- సెమీస్‌కు చేరిన పాఠశాలల జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పాపారాయుడు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో 3వ జలజం సత్యనారాయణ టీ–10 ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. పాఠశాలస్థాయి జట్లు నువ్వానేనా అనే రీతిలో తలపడుతున్నాయి. టోర్నీలో అత్యంత మెరుగైన ప్రతిభ కనబరిచిన లిటిల్ స్కాలర్స్, రెయిన్‌బో స్కూల్, జెడ్పీహెచ్‌ఎస్ నంచర్ల, స్వామి నారాయణ గురుకుల్ (జడ్చర్ల) జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. నేడు (మంగళవారం) ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ముగియనుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌ల సందర్భంగా సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పాపారాయుడు క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఇలాంటిటోర్నీలతో విద్యార్థుల్లో దాగివున్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీయవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ల ఫలితాలు...

ఆరో రోజు జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ల్లో లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ జట్టు 38పరుగుల తేడాతో అపెక్స్ స్కూల్ జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో స్వామినారాయణ గురుకుల్ (జడ్చర్ల) జట్టు 9 పరుగుల తేడాతో సెయింట్ యాగ్నేస్ జట్టుపై, రెయిన్‌బో హైస్కూల్ జట్టు 2పరుగుల తేడాతో జ్ఞానభారతి జట్టుపై, జెడ్పీహెచ్‌ఎస్ నంచర్ల జట్టు 7 వికెట్ల తేడాతో మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ జట్టుపై గెలుపొందాయి.

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా.?

జడ్చర్ల: తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను అడిగితే అరెస్టులు చేయిస్తారా అంటూ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో సోమవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమానికి తరలివెళుతున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా తాము నిరసన కార్యక్రమానికి వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదని వారు ఖండించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘాల నాయకులు సుందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవాబుపేట: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు హైదరాబాద్‌లో సోమవారం చేపట్టే ఆందోళన కార్యక్రమానికి వెళ్తున్న ఆపార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.సొంత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు. అరెస్ట్ అయినవారిలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, అంజయ్య, నర్సింహులు, సంపత్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి ఒకే దరఖాస్తు

గండేడ్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దేవన్న అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణికి ఒకే ఒక దరఖాస్తు వచ్చింది. మండలంలోని పగిడ్యాల్ గ్రామం మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, తాము ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తుడు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ దేవన్న సంబంధిత పంచాయతీ కార్యదర్శి భార్గవితో మాట్లాడారు. నాలుగు రోజులుగా నీరు తక్కువగా వస్తుందని ఆమె ఎంపీడీఓకు తెలిపారు. ఈవిషయమై డీఈఈ, ఈఈలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తా మని ఎంపీడీఓ తెలిపారు. డీటీ మాధవి, ఎంఈఓ జనార్దన్ పాల్గొన్నారు.

ఒకే రోజు 357 పాలసీలు

నవాబుపేట: మండల కేంద్రంలో ఎస్‌బీఐలో ఒకే రోజు 357మంది ప్రమాద, జీవిత భీమా పాలసీలకు సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేయిస్తున్న బీమా పాలసీల కార్యక్రమంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పోస్టాఫీసులో సైతం బీమా చేపట్టే కార్యక్రమం మంగళవారం కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. మండల కేంద్ర ప్రజలకు బీమా ప్రీమియం తానే చెల్లిస్తున్నట్లు నర్సింహచారి తెలిపారు.